ప్రజాశక్తి
బుధవారం 13 నవంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

సిపిఎం మండల కార్యదర్శిగా త్రినాధ్

కొర్రా త్రినాధ్

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : సిపిఎం ముంచంగిపుట్టు మండల కార్యదర్శిగా కొర్రా త్రినాధ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఎం జిల్లాకార్యదర్శి పాచిపెంట అప్పలనర్స ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యుల ఎంపికను ఏకగ్రీవంగా జరిగింది. మూడేళ్లకోసారి నియమించే పార్టీ ఎన్నికల్లో భాగంగా పార్టీ కార్యదర్శితోపాటు 11మంది సభ్యులతో మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల కమిటీ సభ్యులుగా భీమరాజు, సత్యనారాయణ, ఎంఎం శ్రీను, కె నర్సయ్య, లైకోన్, నారాయణ, రామదాసు, గోపాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి త్రినాథ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటానికి నాయకత్వం వహించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బస్కీలో వైద్యశిబిరం నిర్వహించాలి

అరుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న బాలదేవ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని బస్కీ పంచాయతీ జకరవలస గ్రామానికి చెందిన 20 మంది చిన్నారులకు జ్వరం, కండ్ల కలకలు, దురదలు, వాంతులు విరోచనాలతో బాధపడుతూ, వారం రోజులుగా అరకువేలి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆసుపత్రికి వెళ్లి, చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ బస్కీ, జకరవలస గ్రామాల్లో మంచినీటి సదుపాయం లేకపోవడం వల్లే కలుషిత నీటికి వాడుతుండడం వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికే గ్రామానికి చెందిన చిన్నారులు కొర్రా చరణ్ తేజ, గోళ్ళరి నందిని, ఛాలా భానుమతి, వంతాల సాయిపల్లవి, స్వాతి నియోజ్ కుమార్, సమర్తి నవితసమర్తి నవ్యశ్రీ, స్వాతి శ్రవణ్, వంతల నిర్మల, వంతల గౌతమ్ కుమార్,కొర్రా సామియేలు, కొర్రా రితిక,వంతల పాండ్యా కిండంగి అర్జిత్రియ, స్వాతి దిలీత, స్వాతి నిబిన్, కొర్రా సూర్యతేజ, ప్రీతి అభిలాష్ మాదగడ విహాన్ వైద్యాధికారి సూచనల మేరకు అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి, మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

గిరిజన సమస్యలపై ప్రస్తావనే లేదు !

రాష్ట్ర బడ్జెట్‌పై సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- పాడేరు: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రధాన గిరిజన సమస్యలను ప్రస్తావించకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని సిపిఎం అల్లూరి జిల్లాకార్యదర్శి పాచిపెంట అప్పలనర్స విమర్శించారు. ఐదవ గిరిజనులకు తీవ్ర స్థాయిలో ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్న జిఒ 3 పునరుద్ధరణ, గిరిజన ప్రత్యేక డిఎస్సీ సమస్యలను సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుపై ప్రస్తావించకపోవడం గర్హనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అన్నారే తప్ప, ఎప్పటిలోగా పూర్తిచేస్తారో స్పష్టం చేయకపోగా, నిర్వాసితుల సమస్యల పరిష్కారం, వారి పునరావాసం, ప్యాకేజీలపై ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. ఆదివాసులు, దళితులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించారని, సబ్‌ప్లాన్‌గా దళితులకు కేవలం 6.28 శాతం, గిరిజనులకు 2.56 శాతం మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు పెండింగ్‌లోవున్న వేతన పెంపు హామీలనైనా నామమాత్రంగానైనా ప్రస్తావించలేదన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడలేదన్నారు. ఇప్పటివరకు ఉచిత పంటల బీమా స్థానంలో రైతులు ప్రీమియం చెల్లించాలంటూ అన్నదాతలపై భారం మోపడమేనన్నారు. విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల రద్దు ఊసేలేదన్నారు. మొత్తంమీద బడ్జెట్‌లో ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని కూటమి ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు.

పిఎం జన్‌మన్ ఇళ్లకు ఉచిత ఇసుక ఇవ్వాలి

మాట్లాడుతున్న సిపిఎం నేత త్రినాధ్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : పిఎం జన్‌మన్ పథకంలో గుర్తించి ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక ఇవ్వడంతోపాటు, ప్రభుత్వ పరంగా ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఆర్థికసాయాన్ని ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రజాసమస్యలు, ధరలు, ఛార్జీల భారాలపై సిపిఎం ప్రజాపోరులో భాగంగా ఈ నెల 14 న మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ, వి.లైకోన్,ఎం.నర్సింగ్ పడాల్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా కార్లలో సంచరిస్తున్న ఛత్తీస్‌గఢ్ వాసుల బైండోవర్

పోలీసులు బైండోవర్ చేసిన ఛత్తీస్‌గఢ్ వాసులు

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో మారుమూల ఇంజరి పంచాయతీ గిన్నెగరువు గ్రామ సమీపంలో రెండు కార్లలో అనుమానస్పదంగా సంచరిస్తున్న పది మంది ఇతర రాష్ట్రాల వ్యక్తులను బైండోవర్ చేశారు. ఈనెల 8న అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తుల సంచారంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఇంజరి మాజీ సర్పంచ్ పాండు ఆధ్వర్యంలో స్థానికులు పెదబయలు పోలీసులకు ఫోనుద్వారా సమాచారమందించారు. గతనెలలో పిల్లల దొంగలు సంచరిస్తున్నారని ప్రచారం జరిగిన నేపథ్యంలో గిన్నెగరువు గ్రామస్తులు వారిని పట్టుకుని తాళ్లతో బంధించారు. పోలీసులు వెంటనే స్పందించి, అక్కడకు చేరుకుని, పదిమందిని ఇతర రాష్ట్రాల వ్యక్తులతోపాటు రెండుకార్లను అదుపులోకి తీసుకున్నారు. పెదబయలు ఎస్ఐ రమణ ఆధ్వర్యంలో వారిని విచారించిన పోలీసులు, మంగళవారం మెజిస్ట్రేట్ జి.రంగారావు ముందు హాజరుపరచగా, వారికి విచారించిన మెజిస్ట్రేట్, సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచిస్తూ, ఒక్కొక్కరికి రూ. 50 వేలకు బైండోవర్ చేశారు. రెండు కార్లను పోలీసులకు అప్పగించారు. రెండు నెలల తర్వాత సత్ప్రవర్తన కలిగి ఉన్నారని నిర్ధారణకు వచ్చిన తర్వాత కార్లను అప్పగిస్తామని సూచించారు. పోలీసులకు పట్టుబడిన వారంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, దంతెవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన వారిగా గుర్తించడంతో పోలీసులు మరింత అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టుబడిన వారిలో దంతెవాడ జిల్లా బస్తర్‌కు చెందిన ప్రమోద్‌కుమార్ భట్టు, బచేలి మండలానికి చెందిన జాగారం పైస్కి, దేక్తాల్‌పాస్ గ్రామానికి చెందిన క్రిష్ణకుమార్ వాసుదేవ్, బచేలికి చెందిన శంకర్‌ప్రసాద్ విమల్, భైనరాంబెండ్ గ్రామానికి చెందిన కోబ్‌చంద్ భాస్కర్, భన్‌పూర్‌కు చెందిన శరత్‌సింగ్ యాదవ్, జగదల్‌పూర్‌కు చెందిన నసీం ఖాన్, కిలేపాల్ గ్రామానికి చెందిన లచ్చు మండవి, జగదల్‌పూర్‌కు చెందిన శారద బగేల్, హేమలాల్ పటేల్‌గా గుర్తించారు

అదనపు ఆదాయంతోనే రైతుకు సుస్థిరత

- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అదనపు ఆదాయంతోనే రైతులకు సుస్థిరత ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక పిఎంఆర్ సి సమావేశ మందిరంలో జరిగిన సెల్లర్స్ అండ్ బయ్యర్స్ మీట్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి రైతు ఎఫ్‌పిఒలో చేరాలని తద్వారా రైతు శక్తి పెరుగుతుందన్నారు. అన్నదాతలు సమైక్యంగా ఉంటే, వారు అనుకున్న ధర సాధించగలరన్నారు. వ్యవసాయ రంగంలో సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించట్లేదన్న అపవాదు ఉందని, దానిని రూపుమాపాలని, మధ్యవర్తుల ప్రమేయాన్ని అరికట్టాలని సూచించారు. జిల్లాలో మూడు వేల ఎఫ్‌పిఒలు ఉన్నాయని, మిగతా రైతులు కూడా గ్రూపులుగా ఏర్పడాలన్నారు.. మంచి ప్రణాళికలుతో ఎఫ్‌పిఒలు విజయవంతంగా సాగాలని, అందుకు స్టేక్ హోల్డర్స్ సహకరించాలని కోరారు. ఎఫ్‌పిఒలు బయ్యర్స్ మార్కెట్‌గా కాక సెల్లర్స్ మార్కెట్‌గా ఎదగాలని ,అప్పుడే పంట బాగా నాణ్యవంతంగా పండించ గలరని తెలిపారు. ప్రతి రైతు ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. రైతు ఆదాయమే ముఖ్యమని, అందుకు అన్ని విధాలా సహకరిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పెరటి కోళ్ళ, వివిధ వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తులు, మార్కెట్ ట్రెండ్‌లు, విలువ అందించే ఉత్పత్తుల గురించి వివిధ కొనుగోలుదారులతో చర్చించారు. వివిధ కొనుగోలుదారులు, అమ్మకందారులు, ఎఫ్‌పిఒల మధ్య పలు ఒప్పందాలు జరిగాయి. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, సమర్ధవంతమైన మార్కెట్ లింకేజీలను సృష్టించడానికి అవకాశాలను మెరుగుపరచడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. కార్యక్రమంలో హైఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ కట్టా శ్యాం, వ్యవసాయ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులు ఎస్‌బిఎస్ నంద్, పి. రమేష్ కుమార్‌రావు, డ్వామా పిడి ఎం.శివయ్య, నవజీవన్ సంస్థ అధ్యక్షులు సహదేవయ్య, వివిధ ప్రాంతాల నుండి పలువురు రైతులు, కొనుగోలుదారులు, ఎఫ్‌పిఒలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ జ్యోతి

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

అరకులోయ రూరల్: ద ఎబిలిటీ పీపుల్ సంస్థ ఆధ్వర్యంలో 22 మంది వికలాంగులకు మంగళవారం వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, యంత్రాలు, చేతి కర్రలు వంటి ఉపకరణాలను అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఏజెన్సీలో అంగవైకల్యంతో బాధపడుతున్నవారికి ఈ ఉపకరణాలు ఎంతో దోహదపడతాయన్నారు. జిల్లాలో మండల పరిషత్, సచివాలయ సిబ్బంది ద్వారా వైకల్యంతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రంజపల్లి ఉషారాణి, ఎంపిడిఒ లవరాజు, ఎంపిటిసి డి ఆనంద్, తహశీల్దార్, ద ఎబిలిటీ పీపుల్ సంస్థ వైద్యులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి అటవీశాఖ మోకాలడ్డు

అరకులోయ రూరల్: అటవీశాఖ అభ్యంతరంతో ఆగిపోయిన మండలంలోని మాడగడ పంచాయతీ బోసుబెడ జంక్షన్ నుండి మాడగడ సన్‌రైజ్ పాయింట్ వరకు మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ పిబి జ్యోతి కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మాడగడ సర్పంచ్ పి.బి జ్యోతి మాట్లాడుతూ మాడగడ సన్‌రైజ్ పాయింట్ వద్ద అనుమతి లేనిదే ఇతర వాహనాలు లోనికి ప్రవేశించరాదనిఫారెస్ట్ అధికారులు గేట్ వేసి ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. దీంతో సన్‌రైజ్ పాయింట్ వద్దకు వచ్చే దేశ, విదేశాల పర్యాటకులు తిరిగి వెళ్ళిపోతున్నారన్నారు. దీంతో ఇక్కడ పర్యాటకమే ఆధారంగా జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారాలు ఉపాధి కోల్పోయారన్నారు. మాడగడ సన్రైజ్ పాయింట్ స్థలం సర్వే నెంబర్ 84లో 28 ఎకరాలు గయ్యాలు పోరంబోకు భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని, దీనికి అటవీశాఖ అధికారులకు ఎటువంటి సంబంధం లేకపోయినా, పర్యాటకాభివృద్ధిని అడ్డుకునేందుకు ఇలాంటి అభ్యంతరాలను సృష్టిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు.ఈ స్థలంలో పర్యాటకులకు కనీస అవసరాలైన మరుగుదొడ్లు, రక్షిత మంచినీరు, కల్పించి వాహనాల పార్కింగ్, పారిశుధ్య పనులు నిర్వహించి క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచడం ద్వారా పంచాయతీకి ఆదాయం పొందేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. కలెక్టర్ పరిశీలన జరిపి తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టాలని ఎస్ఐ కెల్లా పాపినాయుడును ఆదేశించారు. యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలన్నారు. దీనిపై సంకల్పంలో భాగంగా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, మాదకద్రవాలు అక్రమ రవాణా, అసాంఘిక చర్యలపై నిఘా పటిష్టం చేయాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గర్భకోశ వ్యాధులకు సంబంధించి రాజమండ్రి, కాకినాడ ప్రభుత్వాసుపత్రులకు చెందిన వైద్యాధికారులతో స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పిఒ మాట్లాడారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో మాతా, శిశు మరణాలు సంభవించకుండా కన్వర్జెన్సీ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా మాతా శిశు మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆదేశించారు. ఏజెన్సీల్లోని ఎప్పటికప్పుడు ఫీవర్ కేసులు సంభవించకుండా డోర్ టు డోర్ సర్వే చేయాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రమాదకర గర్భిణులను గుర్తించి ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎడియంహెచ్‌ఓ జి.శిరీష, వైద్యాధికారులు వినోద్, షాహిన్, సంతోష్, గర్భాశయ వైద్య నిపుణులు లక్ష్మి, ఒమీనా, ఝాన్సీ, సుప్రియ, హిమజ, ఎంపీహెచ్‌ఓ పీటర్, హెల్త్ మానిటరింగ్ సెల్ అధికారి ఝాన్సీ, అన్ని మండలాలకు సంబంధించిన ఎయన్‌యంలు, సూపర్వైజర్లు, ఐసిడిఎస్ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, హెల్త్ ఎడ్యుకేటర్స్, ఎంపీహెచ్‌ఒలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఎన్‌పిసిఐ చేయించుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రజలందరూ మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌కు ఆధార్ కార్డు తీసుకొని వెళ్లి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ)కు అనుసంధానం చేసుకోవాలని దేవారం పోస్ట్ మాస్టర్ సూర్య నారాయణ రెడ్డి, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బ్యాంక్ అకౌంట్, పోస్టల్ అకౌంట్ కలిగిన ప్రజలందరూ తప్పని సరిగా ఎన్‌పిసిఐ లింక్ చేయించుకోవాలని కోరారు. భవిష్యత్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ అయ్యేందుకు ఎన్‌పిసిఐ మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. చాలా మందికి ఎన్‌పిసిఐ మ్యాపింగ్ పూర్తికాక ఉపాధి హామీ పథకంలో పని చేసిన అకౌంట్ లేని వారు పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించాలని కోరారు.

డంపింగ్ యార్డుతో ఇబ్బందులు

ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని వేడుకోలు

డంపింగ్ యార్డులో దట్టంగా కమ్మేసిన పొగ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నుండి దేవీపట్నం వెళ్లే రోడ్డులో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, కొత్త పాకలు కాలనీకి మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్‌తో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానిని ఊరికి దూరంగా మార్చాలని కొత్తపాకలు కాలనీవాసులు కోరుతున్నారు. రంపచోడవరం గ్రామంలో దేవీపట్నం రోడ్డులోని డంపింగ్ యార్డ్ ప్రధాన రహదారికి అనుకుని ఉండడంతో డిగ్రీ, జూనియర్ కళాశాలకు, వివిధ కళాశాలలకు ప్రతి రోజు వెళ్లి వచ్చే విద్యార్థులు, మార్గంలో రాకపోకలు సాగించేవారు డంపింగ్ యార్డ్ నుండి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నారు. దీనికి తోడు డంపింగ్ యార్డ్‌లో చెత్తకు మంట పెట్టె సమయంలో ఆ ప్రాంతమంతా పొత కమ్మేసి స్థానికులతో పాటు అటుగా వెళ్లే వారికి ఊపిరాడని పరిస్థితి నెలకొంటోంది. ఈ డంపింగ్ యార్డ్ రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి, కొత్త పాకలు ప్రాంతానికి అతి సమీపంలో ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు దోమలు, ఈగలు నానా అవస్థలు పడుతున్నారు. డంపింగ్ యార్డ్ నుండి వచ్చే దుర్వాసనలతో వారు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా వేరే చోటకి మార్చాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతానికి గిరిజనుడు మృతి

సత్యనారాయణ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల మండలం దాకోడు పంచాయితీ పరిధి దాకోడు గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై ఓ గిరిజనుడు మృతి చెందాడు. మృతిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... దాకోడు గ్రామానికి చెందిన పొడుగు సత్యనారాయణ (30) గ్రామంలోని కరెంటు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామంలో విద్యుత్ స్తంభం ఎక్కి వీధిలైట్లు బాగు చేస్తుండగా కరెంటు షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను వెంటనే స్థానికులు దగ్గరలో ఉన్న అడ్డరివీధి హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సత్యనారాయణకు భార్య, కుమార్తె, కుమారుడు పిల్లలు ఉన్నారు. కుమార్తె రక్తహీనతతో బాధపడుతుండడంతో రక్తమార్పిడి చేయాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో సత్యనారాయణ అనకాల మరణం చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. సత్యనారాయణ మృతితో ఆ కటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నిరుపేద గిరిజనుడైన సత్యనారాయణ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోసం ఫోన్ చేయగా అందుబాటులో లేరు.

50 లీటర్లు నాటుసారా, 8 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-దేవీపట్నం

దేవీపట్నం మండలం అంగులూరు గ్రామ సమీపంలో 50 లీటర్ల నాటుసారాను, 8 లిక్కర్ బాటిళ్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. అంగుళూరు గ్రామ సమీపంలో పోలవరం ప్రాజెక్టు పనుల వద్ద నాటు సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి, ఆయన నుండి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. చినబీంపల్లి గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 30 లీటర్ల నాటుసారా పట్టుకున్నారు. నాగళ్లపల్లి గ్రామంలో అక్రమంగా లిక్కర్‌ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 8 విస్కీ క్వార్టర్ బాటిల్స్ స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ నాటుసారా, బెల్ట్ షాపులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించి, బట్టీలను ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఆరు బయట పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

ఆరు బయటే విద్యా బోధన

స్కూల్ భవనం లేక ఇబ్బంది పడుతున్న బొబ్బిలోవ చిన్నారులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన ధారగడ్డ పంచాయతీ పరిధి బొబ్బిలోవ గ్రామంలో జిపిఎస్ పాఠశాలకు భవనం లేకపోవడంతో ఆరు బయటే విద్యా బోధన సాగించాల్సి వస్తోంది. ఈ పాఠశాలలో 8 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీనికి నేటికీ భవనం లేదు. ఉపాధ్యాయుడు ఆరు బయట విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. ఎండ సమయంలో చెట్ల నీడన, వర్షం వస్తే ఏదో పంచన పాఠశాలను నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి వెంటనే పాఠశాల భవనం ఏర్పాటు చేసి తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయుడు (సీఆర్పీ) గొర్లె ఆనంద్ బాబు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

14న గ్రామ వాలంటీర్ల జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రంపచోడవరం

గ్రామ వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం రూ.10వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ ఈ నెల 14న రంపచోడవరంలో గ్రామ/వార్డు వాలంటీర్ల జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గం 11 మండలాల పరిధిలో ఉన్న వాలంటీర్లు సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎంపిపిని అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎంపిపిని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: ఇటీవల బదిలీపై మండలంలో కొత్తగా నియమితులైన పలువురు కార్యదర్శులు మంగళవారం ఎంపిపి బాకా ఈశ్వరిని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలను అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. మండలంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సోవ్వా, కంద్రుమ్, అరమ, కొల్లా పుట్టు, కొర్ర, కించుమండ, గసభ పంచాయతీ కార్యదర్శులు ఎంపిపిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నూతనంగా నియమితులైన పంచాయతీ కార్యదర్శులంతా గిరిజన ప్రాంతంలో అంకితభావంతో పనిచేసి గిరిజనులకు సేవ చేసి పంచాయతీల అభివృద్ధికి చొరవ చూపి, తోడ్పాటు నివ్వాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యల సుధా, గురుమూర్తి, విజయ్‌కుమార్, వైసిపి నేత బాక సింహచలం ఉన్నారు.

ఉపాధి సిబ్బందితో సమీక్షలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

ఉపాధి కల్పనపై ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి -అనంతగిరి : అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఎవివి.కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో ఎపిఒ నాయుడు అధ్యక్షతన ఉపాధి, వ్యవసాయశాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ. మండలంలోని 24 పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో జాబ్‌కార్డున్న ప్రతిఒక్కరికీ వందరోజుల పని కల్పించాలని, పోడుపట్టాలున్న రైతులకు 150 రోజుల పని కల్పించాలన్నారు. మండలంలోని అర్హులైన ఉపాధి కూలీలను గుర్తించి, వారికి పని కల్పించడం, హౌసింగ్, అగ్రికల్చర్‌కు సంబంధించి పనిదినాలు జనరేట్ చేసి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. గ్రామాలను యూనిట్‌గా లబ్ధిదారులను గుర్తించి పనికల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎపిడి పవన్,సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రమిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - చింతపల్లి : టిబి, ఎయిడ్స్, లెప్రసీ వంటి సంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చింతపల్లి టిబి యూనిట్ ఎంఒటిసి, లోతుగెడ్డ పిహెచ్‌సి వైద్యాధికారి లక్ష్మీకాంత్ అన్నారు. మంగళవారం చింతపల్లి, జికె.వీధి మండలాల టిబి యూనిట్ సభ్యులు, సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలకు లోతుగెడ్డ పిహెచ్‌సిలో శిక్షణనిచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు పరిచి, ఆయా రోగులకు సేవలు అందించాలని సూచించారు. .కార్యక్రమంలో అల్లూరి జిల్లా టిబి డిపిసి శేషు, డిపి స్ రామరాజు, ఎస్‌టిఎల్ఎస్ నగేష్, వెంకటరావు, రెండు మండలాల టిబి సూపర్వైజర్లు ప్రసాద్, అశోక్, ఎస్‌టిఎస్ రహిమాన్, ఎంఎల్‌హెచ్ పిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీకాంత్

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ అభివృద్ధి కోసం కేటాయించిన సాధారణ నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్ పెట్టెలి సుస్మితపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్, జన్ని భగత్ రామ్,వార్డు సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ పిర్యాదు చేశారు. జులై నెలలో స్పందన కార్యక్రమంలో పంచాయతీ నిధులు దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని, దీనిపై కలెక్టర్ ఆదేశాలతో ఆగస్టు 17వ తేదీన పద్మాపురం గ్రామపంచాయతీలో డిపిఒ విచారణ చేపట్టి, సర్పంచ్,సెక్రటరీ ,వార్డు సభ్యుల వాంగ్మూలం తీసుకున్నారన్నారు. 15 రోజుల్లో గా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పి, పంచాయతీ రికార్డులన్నీ పాడేరు తీసుకెళ్లి పోయారన్నారు. ఐదు నెలలు గడిచినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విన్నవించారు. విచారణ పేరుతో పంచాయతీ రికార్డులను డిపిఒ తీసుకెళ్లడంతో అభివృద్ధి పనులు జరగడం లేదని కలెక్టరుకు వార్డు సభ్యులు వివరించారు. దీంతో పంచాయతీలో డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్య పనులకు నిధులు లేక అస్తవ్యస్తంగా మారిందన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే దీనిపై విచారణ చేపట్టి రికార్డులను అప్పగించాలని ఎంపిడిఒను ఆదేశించారు. వైస్ సర్పంచ్ జన్ని భగత్ రాం, వార్డు సభ్యులు, బోయిదే ,కొండమ్మ, ఎస్ సుందరమ్మ, పి రవి, పి చిన్ని,పి సింహాద్రి ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

నిర్మాణాలకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, వైస్ ఎంపిపి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని చీకుమద్దుల సెగ్మెంట్ , గన్నేరుపుట్టు పంచాయతీ, డొంకినవలసలో మండల పరిషత్ 15 వ ఆర్థిక సంఘం నిధులతో సిసి డ్రైనేజీ పనులకు స్థానిక ఎంపిపి కూడా రాజుబాబు, వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధి పనులకు, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరుచేస్తోందన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టి, గడువులోగా పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో నైని సత్తిబాబు, కోరాబు వెంకట్, సంబాయి కామరాజు, గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, తడిగిరి వైస్ సర్పంచ్, సిపిఎం మండల నాయకులు కిల్లో రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు ఎం విశ్వేశ్వర రావు, డొంకినవలస వార్డు సభ్యుడు మజ్జి రాజారావు, పనసబోయిని రజని, కొండబాబు, ఆశ వర్కర్ డుంబేరి పద్మ కుమారి, మానసి కో ఆర్డినేటర్ భవాని, మాజీ సర్పంచ్ మలిపరి పొల్లన్న, డుంబేరి మల్లన్న, మజ్జి తమన్, జన్ని అగ్గిరాజు, దేముడు, రాంప్రసాద్, వంతాల సన్యాసమ్మ, మజ్జి చిలకమ్మ పాల్గొన్నారు.

లింకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

చింతపల్లి : గ్రామాల మధ్య దూరం తగ్గాలంటే కనెక్టివిటీ (లింకు) రహదారులు అవసరమని లంబసింగి సర్పంచ్ కె.శాంతి కుమారి, ఎంపిటిసి ఆర్.నాగమణి.అన్నారు. మంగళవారం పంచాయతీలోని లబ్బంగి గ్రామంలో రూ.4.50లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న కనెక్టివిటీ రహదారి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్యంలో రహదారి సమస్య ప్రధానమైనదని, దీనికి పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామగ్రామానికి లింకు రహదారులు నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. లబ్బంగి కొత్త వీధి నుండి లబ్బంగి గ్రామాన్ని కలిపే 750 మీటర్ల లింకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ రఘునాథ్, వైసిపి సీనియర్ నాయకుడు నూకరాజు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ ఇమ్మానుయేల్, వీ ఆర్ పి లు రాధ, విజయలక్ష్మి, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాశీపట్నంలో వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని కాశీపట్నం గ్రామంలో అనంతగిరి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 35మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలో పలువురు విష జ్వరాలతో బాధపడుతున్నారని వార్తలు వెలువడిన నేపథ్యంలో వైద్యసిబ్బంది స్పందించి, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వరపీడితులకు రక్తపరీక్షలు చేయగా, ఎవరికీ మలేరియా పాజిటివ్‌గా నిర్థారణ కాలేదని వైద్యాధికారి జ్ఞానేశ్వరి తెలిపారు. అన్ని సాదారణ జ్వరాలేనని చెప్పి మందులు అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారం, నీరు తీసుకోవాలని ఆరోగ్యసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఎంఎస్‌డబ్ల్యు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- అనంతగిరి : అనంతగిరి ఘాట్ రోడ్డులో కారు లోయకు దూసుకుపోయిన ఘటలో పెను ప్రమాదం తప్పింది. మంగళవారంపర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు మైదానప్రాంతం నుంచి అనంతగిరి, అరకు వచ్చిన సందర్శకులు తిరుగు ప్రయాణంలో కారులో వెళుతుండగా, టోకూరు పంచాయతీ బోడగూడ సమీపంలో మలుపు వద్ద కారు అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో కారులోని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రయాణికులు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే వివరాలు తెలియరాలేదు.

గంజాయి సాగు చేస్తున్న 18 మంది అరెస్ట్

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని సొలభం పంచాయతీ దేగలరాయి గ్రామంలో గంజాయి పండిస్తున్న 18మందిపై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్ట్ అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు జిల్లాఎస్‌పి అమిత్‌బర్దర్ ఆదేశాలతో పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో దేగలరాయి గ్రామ పరిసరాలన్నీ డ్రోన్ల సాయంతో తనిఖీ చేయగా 20 ప్రదేశాలలో 5 ఎకరాల గంజాయి తోటలను గుర్తించిన అధికారులు వాటిని ధ్వంసం చేశారు. దీనిపై లోతుగా విచారణ చేయగా, అదే గ్రామానికి చెందిన 18 వ్యక్తులు గంజాయి సాగు చేసినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని జిమాడుగుల పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డిపిఎస్ చట్టం, అటవీ చట్టం క్రింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సాగు, రవాణాచట్టరీత్యా నేరమని సిఐ సన్యాసినాయుడు హెచ్చరించారు,

రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని ఖంద్రుమ్ పంచాయతీ గ్రామాల్లో స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల పోరం మండల అధ్యక్షుడు కే హరి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుసోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటసాగు ద్వారా అధిక దిగుబడులు సాధన, సస్యరక్షణపై క్షేత్రస్థాయిలో పంట పొలాల్లో గిరి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హరి మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహా సూచనలు తీసుకుని రైతులు పంటలను పండించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నీలవేణి, పురుషోత్తం, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: ఈనెల 14 నుంచి 21 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయాధికారిణి ఎస్ సునీత తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజూ విద్యార్థులకు, చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించి, విజేతలకు ఈనెల 29న ముగింపు రోజున బహుమతులిస్తామన్నారు. వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరి ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మంగళవారం భీమిలి డివిజన్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఉపాధ్యాయులను కలిసి తొలి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి మండలాల్లో ఆమె పర్యటన ఉత్సాహపూరితంగా సాగింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, 2025 మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించి శాసన మండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న అప్పలరాము

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-సీలేరు : అధ్యాపకులు చెప్పిన ప్రతిభ పాఠాలు విద్యార్థి చక్కగా నేర్చుకుని 2024-25 ఇంటర్ ఫైనల్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాధికారి కె.అప్పలరాము అన్నారు. జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ప్రథమ, ద్వితీయ సిఇసి, హెచ్ఇసి క్లాస్ రూమ్‌కి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నతమైన విద్యను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షలు ముందు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించుకుని చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల కార్యాలయంలో ప్రిన్సిపల్ వి.శంకరరావు అధ్యాపకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కళాశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి-సీలేరు : పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా సీఆర్పీఎఫ్ పోలీసులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం సీలేరులో చేపట్టారు. జీకే వీధి మండలం సీలేరు సిఆర్పిఎఫ్ పార్టీ టు జి బెటాలియన్ ఇన్స్పెక్టర్ వికాస్ పాండే ఆధ్వర్యంలో సీలేరు పోలీస్ స్టేషన్ ఎదురుగా మెయిన్ డ్యామ్‌కి వెళ్ళే ప్రధాన రహదారికి ఇరువైపులా వివిధ జాతులకు చెందిన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాల్లో పచ్చని చెట్లు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. చెట్లు పెంచడం వలన మానవాళికి కావలసిన ఆక్సిజన్‌ని సరఫరా చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అందెశ్రీ, ఖదీర్‌లకు లోక్‌నాయక్ పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా నందమూరి తారక రామారావు, హరి వంశరాయ బచ్చన్‌ల వర్ధంతిని పురస్కరించుకొని అందిస్తున్న లోక్‌నాయక్ పురస్కారాలను పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మంగళవారం ప్రకటించారు. ఆంధ్ర యూనివర్సిటీలోని హిందీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పురస్కారానికి ప్రముఖ డప్పు కళాకారులు అందె ఎల్లయ్య (అందెశ్రీ)ని, ముస్లిం మైనార్టీవాద కవి ఖదీర్ మోహియుద్దీన్‌ను ఎంపిక చేశామని, వారికి రెండు లక్షల నగదు బహుమతిని, పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. సమాజ సేవ విభాగంలో కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, పద్మావతి దంపతులకు లోక్‌నాయక్ పురస్కారంతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి అందించనున్నట్టు వెల్లడించారు. జీవన సాఫల్య పురస్కారాన్ని వైద్య, సినీ రంగంలో అనేక సేవలు అందిస్తున్న డాక్టర్ హరినాథ్ పొలిచర్లకు అందిస్తున్నామన్నారు. జనవరి 18వ తేదీన విశాఖ వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత ఇసుక అందివ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కె.నరసింగరావు కోరారు. మంగళవారం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక లభించని కారణంగా భవన నిర్మాణ కార్మికులకు సరైన పని దొరకడం లేదన్నారు.

ఉత్తరాంధ్రపై చిన్నచూపు

సుజల స్రవంతికి నామమాత్రపు నిధులు
రూ.17,050.20 కోట్ల విలువైన ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.63.21 కోట్లే కేటాయింపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వాలకు ఉత్తరాంధ్రపై చిన్నచూపు పోలేదు. ఎంత కేటాయించినా ఆ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు ఇదే ఎక్కువని ముచ్చటపడతారనేమో... రూ.17 వేల కోట్ల విలువైన బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (బిజెఆర్‌యుఎస్ఎస్)కి కూటమి ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లో రూ.63.21 కోట్లు మాత్రమే కేటాయించింది. రాష్ట్రంలో అత్యధిక మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ఉత్తరాంధ్రను తానెప్పుడూ మర్చిపోనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతూనే ఉత్తరాంధ్రకు వెన్నుముక వంటి సుజల స్రవంతిని విస్మరించారు.

ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మెట్ట ప్రాంతంలోని ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీటి వసతి, 48 మండలాలు 1037 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీటి సౌకర్యం, విశాఖ నగర ప్రజలకు, పరిశ్రమలకు నీటిని సరఫరాచేసే సామర్థ్యం కలిగిన బిజెఆర్‌యుఎస్ఎస్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసి దశాబ్దమున్నరైనా ఈనాటికీ ఒక్కడుగూ ముందుకుపడలేదు. రూ.7,214 కోట్ల విలువైన బిజెఆర్‌యుఎస్ఎస్ పనులకు 2009 ఫిబ్రవరి 21న నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సబ్బవరంలో శంకుస్థాపన చేశారు. 2018 నవంబరు 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.2022 కోట్లతో తొలిదశ పనులకు శంకుస్థాపన చేసి 1.30 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. బిజెఆర్‌యుఎస్ఎస్ పూర్తయితే ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3.25 లక్షల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు లభించనుంది. తొలిదశ పనులు పూర్తయితే 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు సౌకర్యం లభిస్తుందని జిల్లా ప్రజలు ఆశపడ్డారు. నిధులు ఇవ్వకపోవడంతో ఆ ఆశ నెరవేరలేదు. తరువాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫేజ్-1, ఫేజ్-2లో నాలుగు ప్యాకేజీల కింద బిజెఆర్‌యుఎస్ఎస్ పనులు పూర్తిచేస్తామని 2021లో హామీ ఇచ్చి నిధులు విడుదల చేయలేదు. 2024 మే నాటికి బిజెఆర్‌యుఎస్ఎస్ భూ సేకరణ పూర్తిచేయాలని గడువు విధించి నిధులు కేటాయించలేదు.

సుజల స్రవంతి ఫేజ్ 1 పనుల శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు (ఫైల్)

వాస్తవానికి బిజెఆర్‌యుఎస్ఎస్ ప్రాజెక్టు ప్రధాన కాలువ పనులకు 16,043 ఎకరాల భూమి సేకరించాల్సివుంది. అధికారుల అంచనా ప్రకారం ఈ భూ సేకరణకు రూ.2,149.67 కోట్లు అవసరం కానుంది. అనకాపల్లి బిజెఆర్‌యుఎస్ఎస్ ప్రాజెక్టు భూసేకరణ విభాగపు అధికారులు 1205 ఎకరాలకు ప్రైమరీ భూ సేకరణ నోటిఫికేషన్ జారీచేశారు. గడువులోపు తుది నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో ప్రైమరీ భూ సేకరణ నోటిఫికేషన్ రద్దయింది. దీంతో ప్రభుత్వానికి గతంలో సుమారు ఎనిమిది కోట్లు వృథా అయింది.

రూ.17,050.20 కోట్ల విలువైన బిజెఆర్‌యుఎస్ఎస్‌కు ప్రభుత్వ కేటాయింపులు

సంవత్సరం	కేటాయింపులు (కోట్లలో)
2019-20	170.06
2020-21	107.96
2021-22	79.95
2022-23	297.50
2023-24	141.79
2024-25	63.25

ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి వసతి (ఎకరాల్లో)

విశాఖపట్నం జిల్లా	3.21 లక్షలు
విజయనగరం జిల్లా	3.94 లక్షలు
శ్రీకాకుళం జిల్లా	0.85 లక్షలు
మొత్తం	**8.00 లక్షలు**

తొలినుంచీ అంతే..

2009 ఫిబ్రవరి 21న శంకుస్థాపన చేసినప్పటి నుంచి 2024-25 బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం చేసిన కేటాయింపుల వరకు ఏ ప్రభుత్వమూ బిజెఆర్‌యుఎస్ఎస్ ప్రాజెక్టు పనులు జరిగేలా నిధులు కేటాయించి విడుదల చేయలేదు. చివరకు కేటాయించిన నిధులు కూడా ఇవ్వలేదు. సకాలంలో ప్రాజెక్టు పనులు పూర్తిచేయకపోవడంతో ప్రాజెక్టు వ్యయ అంచనా విలువ రూ.7,214 నుంచి రూ.17,050.20 కోట్లకు పెరిగింది.

అనారోగ్య సిరల చికిత్స పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనారోగ్య సిరలు (వరికోస్ వీన్స్) చికిత్స పట్ల అవగాహన అవసరమని విశాఖపట్నం అపోలో హాస్పిటల్ కన్సల్టెంట్, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రసాద్ నల్లాల తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకప్పుడు ఇది ప్రాథమికంగా సౌందర్య సమస్యగా పరిగణించబడేదిగానీ ఇప్పుడు భారతీయ జనాభాలో 30 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. మహిళల్లో తీవ్రమైన సమస్యగా గుర్తించబడిందని పేర్కొన్నారు. అనారోగ్య సిరల పరిస్థితిని వివరించారు. సిరల్లోని బలహీనమైన లేదా దెబ్బతిన్న కవాటాల వల్ల కలిగే సాధారణ పరిస్థితి వల్ల ఇది జరుగుతుందని అన్నారు. ఎక్కువసేపు నిలబడటం లేదా కూర్చోవడం, ఊబకాయం, గర్భం లేదా జన్యు సిద్ధత వల్ల సంభవించవచ్చునని తెలిపారు. కాలు నొప్పి లేదా వాపు, బరువుగా అనిపించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. అవి కనిపించిన వెంటనే అప్రమత్తమవ్వాలన్నారు.

విదేశీ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో గుట్టు చప్పుడు కాకుండా విదేశీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం వెంకోజీపాలెం వద్ద ఉన్న మహారాణిపేట సర్కిల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు ఆ వివరాలను తెలియజేశారు. ముందస్తు సమాచారం మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు అల్లిపురం సమీపంలోని అచ్చియమ్మపేటలోగల ఒక ఇంటిలో సోదాలు నిర్వహించి సుమారు నాలుగు లక్షల మార్కెట్ విలువగల గోవా మద్యం 21 బాటిళ్లు, కర్ణాటక మద్యం 7 బాటిళ్లు, తెలంగాణ మద్యం 18 బాటిళ్లు, ఢిల్లీ మద్యం 4 బాటిళ్లు, విదేశీ మద్యం 18 బాటిళ్లు, డిఫెన్స్ మద్యం 7 బాటిళ్లుకలుపుకొని 75 బాటిళ్లు ను స్వాధీనం చేసుకున్నారన్నారు. వాటిని విక్రయిస్తున్న నానబెల్లి గణేశ్వరరావును అరెస్టు చేసి విచారణ చేపట్టగా తన మేనల్లుడు లక్ష్మణ్ అవినాష్ వివిధ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అతని ద్వారా వాటిని తెప్పించినట్టు ఒప్పుకున్నాడన్నారు. మరింతలోతుగా విచారణ సాగిస్తామన్నారు.

దీక్షల్లో కూర్చున్న స్టీల్ సిఐటియు నాయకులు

ఉక్కు కార్మికులపై కక్ష సాధింపు చర్యలు తగవు

ప్రజాశక్తి - ఉక్కునగరం : ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు తగవని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు గంగాధర్ అన్నారు. కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించడంలో యాజమాన్యం విఫలమైందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1370వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు నాయకులు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని కార్మికులు కోరుతుంటే స్టీల్ యాజమాన్యం, ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్లాంట్‌ను కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేట్ ఉక్కు పరిశ్రమలకు గనుల కేటాయింపులో అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. గత పదేళ్ల కాలంలో కేంద్రంలోని బిజెపి ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమను కూడా నిర్మించలేదన్నారు. ఉన్న పరిశ్రమలను కూడా ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. సంఘం కార్యదర్శి భానుమూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నష్టాల్లోకి నెడుతున్నారన్నారు. దీక్షల్లో సోమునాయుడు, వేణుగోపాల్, పుల్లారావు, వీరబాబు, సంజీవరావు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన రైతులు ఉద్యానవన పంటలు అభివృద్ధి చేయడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక హెచ్‌ఎంటీసీ ఫారంలో జీడి మామిడి, మామిడి, జాఫ్రా మొక్కలు అంట్లు కట్టే పనులను మంగళవారం పిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాలలో గిరిజన రైతులు ఉద్యానవన పంటలు వేసుకునే విధంగా సబ్సిడీపై 2024-2025 సంవత్సరానికి గాను సుమారు 30 వేల మొక్కల అంట్లు సరఫరా చేసే విధంగా అంట్లు కట్టాలన్నారు. వచ్చే సంవత్సరం సుమారు 50 వేల ఉద్యానవన మొక్కలు అంట్లు కట్టే విధంగా ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లి గ్రామంలో మళ్లీ ఉద్యానవన పంటల మొక్కల నర్సరీ, రబ్బర్ మొక్కల అంట్లు ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గిరిజన రైతులు ఉద్యానవన పంటల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి కే.చిట్టిబాబు, భీమన్న, నూకరాజు పాల్గొన్నారు.

ఏజెన్సీలో మాదిగలకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఏజెన్సీ ప్రాంతంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎంఆర్‌పిఎస్ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల అధ్యక్షులు ఎం చిన్న సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం సంఘం జిల్లా నాయకులు మోర్త బుజ్జి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిన్న సుబ్బారావు మాట్లాడుతూ ఏజెన్సీలోని మాదిగలకు ఏ ప్రభుత్వం వచ్చినా న్యాయం జరగటం లేదన్నారు. అనంతరం అల్లూరి జిల్లాల్లో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఎంఆర్‌పిఎస్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులుగా మోర్త బుజ్జిబాబును, మండల కన్వీనర్‌గా పెద్ద నూకరాజును నియమించారు. కార్యక్రమంలో మాదిగ పెద్దలు బోడపాటి కామరాజు, గుండెపల్లి జీవరత్నం, పిల్లి కిరణ్ పాల్గొన్నారు.